సమస్యల స్టేషన్లు!

- కనీస సౌకర్యాలకు దూరంగా భట్టిప్రోలు, పల్లెకోన రైల్వే స్టేషన్లు
- రేపల్లె - సికింద్రాబాద్ రైలు నిలుపుదల లేక ప్రయాణికుల ఇబ్బందులు
- లైట్లు వెలగక చీకట్లు.. అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



భట్టిప్రోలు రైల్వేస్టేషన్



నిర్మానుష్యంగా ఉన్న పల్లెకోన రైల్వేస్టేషన్

భట్టిప్రోలు: తెనాలి–రేపల్లె మార్గంలో భట్టిప్రోలు, పల్లెకోన స్టేషన్లలో అనేక సమస్యలు కూతపెడుతున్నాయి. ప్రయాణికులకు కనీస వసతులు సమకూర్చకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రతిరోజూ 8 రైళ్లు ఈ మార్గంలో తిరుగుతుంటాయి. భట్టిప్రోలు రైల్వేస్టేషన్‌లో సరిగా రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు లేక చిమ్మ చీకట్లే రాజ్యమేలుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా స్టేషన్లలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడం గమనార్హం. భట్టిప్రోలు రైల్వేస్టేషన్‌కు ఏటా రూ.84 లక్షలు, పల్లెకోన నుంచి రూ.34 లక్షల ఆదాయం రైల్వేకి సమకూరుతుంది. వేమూరు నుంచి రూ. 56 లక్షలు మాత్రమే వస్తుంది. ఐనప్పటికీ ప్రతి నిత్యం సికింద్రాబాద్ నుంచి రేపల్లె వచ్చే 17645 నంబరు రైలు పల్లెకోన రైల్వే స్టేషన్‌లో ఆగడం లేదు. ఈ రైలు చినరావూరు దాటిన తరువాత జంపని, నియోజకవర్గ కేంద్రమైన వేమూరు, పెనమర్రు, పల్లెకోన రైల్వే స్టేషన్లలో ఆగకపోవడంతో సమీప గ్రామ వాసులు పలు ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటి కంటే ఆదాయం తక్కువగా ఉండే చినరావూరులో నిలుపుదల సౌకర్యాన్ని అలానే కొనసాగిస్తున్నారు. భట్టిప్రోలు, పల్లెకోన స్టేషన్లు ప్రైవేట్ పరం అయ్యాయి. రైళ్లు ఆగకపోవడంతో స్టేషన్లు నిర్మానుష్యంగా మారడమే కాక రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆలవాలంగా మారాయి. రైలు ఫుట్‌బోర్డుకన్నా ప్లాట్‌ఫారమ్ లైన్ రెండు రెట్లు కిందకు ఉంది. దీని ఎత్తు పెంచి ఆధునికీకరించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

అదనపు బోగీలు వేయరూ..!

రేపల్లె–తెనాలి–గుంటూరు రహదారి మార్గంలో తిరిగే రైళ్లకు తగినన్ని బోగీలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రైళ్లకు కేవలం 8 బోగీలు మాత్రమే ఉన్నాయి. ఇందులో కొంత భాగం ముందు, వెనుక ఇంజిన్లకే సరిపోతుంది. ప్రతి నిత్యం ఈ రైళ్లకు విపరీతమైన రద్దీ ఉంటుంది. కూర్చునేందుకు చోటు లభించక ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

రిజర్వేషన్ కోసం పాట్లు...



భట్టిప్రోలు రైల్వేస్టేషన్‌లో ఆదాయానికి తగిన విధంగా రైల్వేశాఖ అభివృద్ధి చేపట్టడం లేదు. రాత్రిళ్లు రైలు వచ్చేటప్పుడు మాత్రమే లైట్లు వెలుగుతాయి. ప్రైవేట్ పరం చేయడంతో కంప్యూటర్ టికెట్లు ఇవ్వడం లేదు. రిజర్వేషన్ చేయించుకోవడం కోసం వేమూరు, తెనాలి, రేపల్లె వెళ్లాల్సి వస్తోంది.

– మాచర్ల వీరేంద్ర, ఐలవరం, భట్టిప్రోలు మండలం

ప్లాట్‌ఫామ్ ఎత్తు పెంచాలి...



కరోనా సమయంలో విద్యుద్దీకరించిన ఈ రైలు మార్గం ట్రాక్ లెవల్ పెంచారు. ఇందుకు అనుగుణంగా ఆయా స్టేషన్ల ప్లాట్‌ఫామ్ ఎత్తు పెంచలేదు. సికింద్రాబాద్–రేపల్లె రైలు పల్లెకోన స్టేషన్‌లో ఆగకపోవడంతో రెండు నియోజకవర్గాలకు చెందిన 8 గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. – ముప్పుంగి వెంకటేశ్వరరావు, పల్లెకోన, భట్టిప్రోలు మండలం

క్లుప్తంగా

కార్పెంటర్లకు వృత్తి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



భట్టిప్రోలు: పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన కార్పెంటర్లకు వృత్తి ధ్రువీకరణ పత్రాలను సోమవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో అందజేశారు. గత సోమవారం నుంచి శనివారం వరకు ఈ సెంటర్‌లో శిక్షణా తరగతులు జరిగాయి. సెంటర్ మేనేజర్ కోటి స్పందనా దేవి, ఏపీ వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడూరు వెంకటేశ్వరరావులు ఈ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం స్పందనాదేవిని కార్పెంటర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత



డాక్టర్ రామలక్ష్మి

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంను విజయవంతం చేయాలని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి చావలి రామలక్ష్మి సోమవారం పేర్కొన్నారు. రామలక్ష్మి మాట్లాడుతూ ఏడాది వయస్సు దాటిన వారికి ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా మంగళవారం నుంచి అందించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు ఇస్తారని తెలిపారు. రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం వంటి లోపాల నివారణకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆరు నెలలకొకసారి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అనధికారికంగా బెల్టుషాపులు నడుపుతున్నా.. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ ఆఫ్ పీపుల్ నేషనల్ కమిషన్ కో–ఆర్డినేటర్ పిన్ని సాంబశివరావు ఆరోపించారు. రేపల్లెలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బెల్టు దుకాణాలలో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రతి గ్రామంలోని బెల్టు షాపులు నడుస్తున్నాయన్నారు. బెల్టుషాపులపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే హ్యూమన్ రైట్స్ తరపున ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. హ్యూమన్ రైట్స్ సభ్యులు కారుమూరి హనోక్‌బాబు, జుజ్జువరపు సురేష్, ఉప్పాళ్ల శ్రీకొండ తదితరులున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

వ్యక్తికి స్వల్పగాయాలు..
మరో వ్యక్తిపై రాయితో దాడి

భట్టిప్రోలు: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులు ఒకరికొకరు ఢీకొనడంతో ఓ యువకుడికి గాయాలు కాగా ప్రతిగా ఆ వ్యక్తి ఢీకొట్టిన యువకుడిని కులం పేరుతో దూషించి తలపై రాయితో కొట్టిన సంఘటన ఇది. ఎస్‌ఐ ఎం.శివయ్య కథనం ప్రకారం ఆదివారం రాత్రి భట్టిప్రోలుకు చెందిన మేడూరి గిరిధర్, గౌతమ్‌లు ఓ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా మండ్రు వెంకటేష్ అనే యువకుడు ఒకరికొకరు ఢీకొనడంతో గిరిధర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. గిరిధర్, గౌతమ్‌లు కలసి వెంకటేష్‌ను కులం పేరుతో దూషిస్తూ, రాయితో తలపై మోదారు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెనాలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కర్లపాలెంలో వాహనాల తనిఖీ



కర్లపాలెం: మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ చెప్పారు. సోమవారం కర్లపాలెం సెంటర్‌లో స్థానిక ఎస్‌ఐ ఎస్.రవీంద్రతో కలిసి సీఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హరికృష్ణ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని చెప్పారు. వాహనాలకు సంబంధించిన పర్మిషన్లు బండి వద్దే ఉంచుకోవాలని, సంబంధిత అధికారులు అడిగినప్పుడు తప్పనిసరిగా వారికి చూపించాలని అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. వాహన తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన పున్నమ్మతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీంద్ర

కర్లపాలెం: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి యత్నించగా స్థానికుల సమాచారం మేరకు ఆమెను పోలీసులు కాపాడిన సంఘటన సోమవారం రాత్రి కర్లపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు చింతాయపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల పున్నమ్మ ఒంటరిగా నివాసం ఉంటుందని తెలిపారు. ఈమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నప్పటికీ వారు వేరే గ్రామాల్లో ఉండటంతో ఆమె బాగోగులు బంధువులు చూస్తున్నారని ఆయన తెలిపారు. మతిస్థిమితం లేని పున్నమ్మ సోమవారం రాత్రి కర్లపాలెంలోని తుంగభద్ర కాలువలో దూకేందుకు ప్రయత్నించగా అక్కా రైతులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ గమనించి ఆమెను కాలువలో దూకకుండా నిలువరించి తమకు సమాచారం అందించటంతో సిబ్బందిని పంపి ఆమెను స్టేషన్‌కు రప్పించామన్నారు. ఈ విషయమై ఆమె కుమారుడికి తెలియజేసి పున్నమ్మను బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు పంటనష్టం అంచనా జాబితా విడుదల

వేమూరు: నియోజకవర్గంలో పంటనష్టం అంచనా జాబితాలు సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ప్రదర్శనకు ఉంచడం జరుగుతుందని రేపల్లె వ్యవసాయ డివిజన్ అధికారి ఆర్.విజయబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో రైతులు, కౌలు రైతులు 77,832 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలు వల్ల 22,992 ఎకరాలు దెబ్బతినట్లు ఆయన తెలిపారు. వీఆర్వో, గ్రామ వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించడం జరిగిందన్నారు. రైతులు, కౌలు రైతులు పంటనష్టం అంచనా జాబితాలు పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలను స్వీకరించి తుదిజాబితా బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు.

దోమల నివారణ చర్యలు

భట్టిప్రోలు: దోమల నివారణకు భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం ఫాగింగ్ నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ దారా రవి కిరణ్మయి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇస్రోలో తెనాలి గజ్జెలు ఘల్లుఘల్లు

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (ఇస్రో)లో భారతీయ శాస్త్రవేత్తలు జరుపుకొనే వినాయక చవితి మహోత్సవాలకు ఈ ఏడాది సైతం తెనాలిలోని శ్రీలక్ష్మి కూచిపూడి నృత్యకళా కేంద్రానికి ఆహ్వానం లభించింది. శనివారం జరిగిన ఈ వేడుకల్లో కళాకేంద్రం నిర్వాహకురాలు, నృత్యగురువు ఎ.వెంకటలక్ష్మి శిష్య బృందం నృత్య ప్రదర్శనకు అవకాశం కల్పించారు. వీరు వివిధ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి జ్ఞాపికలను బహూకరించటమే కాకుండా, వారికి అంతరిక్ష కేంద్రంలో రాకెట్ విభాగాలను సందర్శించే అవకాశం కల్పించటం, వాటిగురించి విజ్ఞానపరమైన పరిచయం చేయటం సంతోషంగా ఉందని నృత్య గురువు వెంకటలక్ష్మి తెలియజేశారు. – తెనాలి

వైభవంగా ఆరంభమైన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున వైఖానస ఆగమం ప్రకారం అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం అంకురార్పణ, పవిత్ర అధివాస కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

మంగళవారం సుదర్శన హోమం జరుగుతుందని, 18న పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ జరుగుతాయని ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మడుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు, రజత పతకాలు

తెనాలిఅర్బన్: టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలికి చెందిన యూనిక్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఐదుగురికి బంగారు, ఒకరికి రజత పతకం లభించినట్లు కోచ్ జట్టు నాగరాజు తెలిపారు. పోటీలను వైఎస్సార్ కడప జిల్లాలోని శంఖారాపురం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొనట్లు వివరించారు. వీరికి సోమవారం చెంచుపేటలోని అకాడమీలో పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ వేడుకలు



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



కొల్లూరు జెండా చెట్టువద్ద అన్నదాన కార్యక్రమం

భట్టిప్రోలు: మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని మండలంలోని ముస్లింలు మిలాద్–ఉన్–నబీ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. అద్దేపల్లి, భట్టిప్రోలు, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాలలోని మసీదుల్లో గత 12 రోజులుగా మత గురువులు మహ్మద్ ప్రవక్త చరిత్రపై ప్రవచనాలు ఇస్తున్నారు. 12 రోజులుగా పాటిస్తున్న ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. ప్రవక్త మహ్మద్ సల్లేలాహు వసల్లమ్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మిలాద్ ఉన్ నబీ వేడుకలను రేపల్లె పట్టణ, మండలంలోని పలుగ్రామాలలో సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా మసీదు నుంచి ఇసుకపల్లి వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అల్లా చూపిన సన్మార్గంలో నడవాలని ముస్లిం పెద్దలు కోరారు. అనంతరం పెద జామియా మసీదు వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

కొల్లూరులో...

కొల్లూరు: మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పర్వదినోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక జెండా చెట్టు వద్ద మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముస్లింలతోపాటు, హిందువులు సైతం పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

శాశ్వత డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



కిష్కిందపాలెంలో మాట్లాడుతున్న డి.రమాదేవి

కొల్లూరు: లంక గ్రామాలకు శాశ్వత డ్రైనేజ్ ఏర్పాటు చేసి ప్రజలను, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కిష్కిందపాలెంలో రైతు సంఘం ఆధ్వర్యంలో లంక గ్రామాల రైతులతో శాశ్వత డ్రైనేజ్ ఏర్పాటు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ, కృష్ణా నది వరదల వల్ల లంక గ్రామాలకు చెందిన రైతులు రూ.కోట్లు విలువ చేసే పంటలను నష్టపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంభవించిన వరదలు తగ్గిన అనంతరం వరద నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం కారణంగా పంట నష్ట తీవ్రత మరింత పెరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం చొరవ తీసుకొని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పోతార్లంక నుంచి పెసర్లంక వరకు శాశ్వత డ్రైనేజ్ ఏర్పాటు చేయడం కోసం కృషి చేయాలని కోరారు. డ్రైనేజ్ వ్యవస్థ కోసం 2010లో డ్రైనేజ్, ఇరిగేషన్ అధికారులు తయారుచేసిన డీపీఆర్ రిపోర్టును అమలు కోసం అధికారులు కృషి చేయాలన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు రైతుల నుంచి భూమి సేకరించాల్సి వస్తే రైతులకు నష్టపరిహారం చెల్లించి భూ సేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటుక బట్టీల వ్యాపారుల అక్రమ మట్టి తవ్వకాల కారణంగా రోడ్లు , వ్యవసాయ భూములు కోతలకు గురవుతున్నాయని, అక్రమ తవ్వకాలపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సదస్సు చివరిలో రైతులందరూ రాజకీయాలాకు అతీతంగా ఐక్యంగా ఉండి శాశ్వత డ్రైనేజ్ ఏర్పాటుకు కృషిచేయాలని తీర్మానించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకర్, రైతు సంఘం నాయకులు బీఎల్‌కే ప్రసాద్, కె.రామస్వామి, ప్రజాసంఘాల నాయకులు బి.సుబ్బారావు, పి.మనోజ్, నాగరాజు, వ్యాపారవేత్త వేములపల్లి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ లడ్డూ వేలంపాట



లడ్డూతోపాటు దక్కించుకున్న బంగారు నెక్లెస్‌ను చూపుతున్న గోపాలరావు దంపతులు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని మెడికల్ కాంప్లెక్స్ నవమ గణపతి మహోత్సవాలను తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగాయి. స్వచ్ఛమైన బంక మట్టితో భారీ గణనాథుడి విగ్రహాన్ని రూపొందించి, ప్రకృతి రూపంలో ఉండేలా ప్రతిమ నిండుగా గరికతో సహా ప్రతిష్టించటం ప్రత్యేక ఆకర్షణ. తొమ్మిదో రోజైన ఆదివారం రాత్రి విశేష పూజలు చేశారు. స్వామివారి లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు. ముందుగా స్వామివారి మహాప్రసాదం (36 కిలోల లడ్డు)ను వేలంపాటలో శ్రీధర్ మెడికల్ డిస్ట్రిబ్యూటర్ తాడిపత్రి గోపాలరావు రూ.2.80 లక్షలకు దక్కించుకున్నారు. నిర్వాహకులు లడ్డూతోపాటు డీడీ బాస్‌తో తయారుచేసిన 30 గ్రాముల బంగారు నెక్లెస్‌ను గోపాలరావు దంపతులకు అందజేశారు. కుబేర హుండీ, 10 కిలోల కుబేర శివలింగ లడ్డూను లక్ష్మీసాయి ట్రేడర్స్ యజమాని రూ.30 వేలకు దక్కించుకున్నారు. స్వామి పాదాల చెంత ఉంచిన మరో అయిదు కిలోల లడ్డూ, 50 గ్రాముల వినాయకుని వెండి విగ్రహాన్ని విశాలాక్షి మెడికల్స్ నాళం సుబ్రహ్మణ్యం రూ.35,700లకు దక్కించుకున్నారు. మూడు కిలోల లడ్డూను శ్రీపద్మావతి ఫార్మస్యూటికల్స్ నాగేంద్ర పాడారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ బింగుమళ్ల పద్వీ పర్యవేక్షించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌బాబు



ఓలేరు పల్లెపాలెంలో నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న విల్లీ ఆర్మ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు



పెనుమూడిలో వరద ముంపు బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

కొల్లూరు: వరదల కారణంగా ఇబ్బందులకు గురైన బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని సరకులు అందజేశారు. మండలలోని చింతర్లంకకు చెందిన వేమూరి లక్ష్మణరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిత్యావసర సరకులు సమకూర్చి వరద బాధితులకు తోడుగా నిలవడం హర్షణీయమని ఈసందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ శిగిలిశెట్టి రాఘవరావు, మాజీ సర్పంచి కోగంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: వరద బాధితుల సహాయార్థం విల్లీ ఆర్మ్స్ ఫౌండేషన్ (పెదపులివర్రు) ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో 120, జువ్వలపాలెం కొత్తూరులంక గ్రామంలో 100 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పెదపులివర్రుకు చెందిన పాస్టర్ బడుగు మణిభూషణ్ విలియమ్స్ జ్ఞాపకార్థం పెదపులివర్రు వాసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

260 కుటుంబాలకు సాయం..

రేపల్లె రూరల్: ఇటీవల సంభవించిన వరద ముంపు ప్రాంతాలలోని బాధితులకు పలువురు దాతలు చేయూతనిస్తున్నారు. మండలంలోని పెనుమూడి, కామరాజుగడ్డ నార్త్‌లలోని వరద ముంపునకు గురైన 260 కుటుంబాలకు రేపల్లె ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రభుకిరణ్, ఆయన స్నేహితులు సోమవారం బియ్యం, నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. వాకా శశిధర్, సతీష్, కొక్కిలిగడ్డ వినోద్, కిరణ్ తదితరులున్నారు.

40 మంది ప్రైవేట్ ఉపాధ్యాయులకు కిట్ల పంపిణీ



భట్టిప్రోలు: బాపట్ల జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో రూ.1.08 లక్షలు వసూలు చేసి వరద ముంపు గ్రామాలకు చెందిన 40 మంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయలు సోమవారం నిత్యవసర వస్తువులు, దుస్తుల కిట్లను అందజేశారు. భట్టిప్రోలు మండలం పెసర్లంక స్వాతి ఇంగ్లిష్ స్కూల్‌లో వీటిని అందజేశారు.